# బింబిసారుని పూలతోట

అనగా అనగా ఒక రాజు ఉండేవాడు. అతని పేరు బింబిసారుడు. ఆయన అంగ, వంగ, అవంతి, కాశీ రాజ్యాలకు రాజు. ఆయన పాలన క్రింద జనం హాయిగా ఉండేవారు. ఆయన రాజ్యాన్ని పెద్దది చేయవలెనని ఒకసారి వైశాలి రాజ్యంపై దండెత్తెను. ఆ వైశాలిరాజు బింబిసారునకు లొంగిపోయెను; కానుకగా కూతురునిచ్చి పెండ్లి చేసెను.

బింబిసారుని బలపరాక్రమములు చూచి అతనిని ఎదుర్కొనే రాజే అరుదయ్యెను. ఆరీతిగా ఆ రాజు రాజ్యాలకు రాజ్యాలే జయించి మహారాజాధిరాజయ్యెను.

అసలు మహారాజులకు పేదల కష్టాలు కనుపించవు. పైగా వారు కరకుగా ఉండుట మామూలు కాని బింబిసారుడు చాల దయగల రాజు. అతని రాజఠీవి చూచి జనం హడలిపోయేవారు. అయితే ఆపదలో నున్నవారికి, అడిగినవారికి "లేదు" అనేవాడు కాదు బింబిసారుడు.

బింబిసారుడు మగధరాజ్యమును పూలతోటలతో ఉద్యానవనములతో కన్నుల పండుగ చేయ బూనెను. రాజగృహమును అందమైన ఉద్యానవనాలతో చూడ ముచ్చటగా అలంకరింపజేశాడు. గాయకులు రాజగృహంలోని పూలతోట సొంపు దేశదేశాల గానం చేసేవారు. పరాయిదేశస్థులు వచ్చి ఆ దేశంలో చూడదగిన వింతల్లో రాజగృహోద్యానవనం ఒకటి.

ఆ ఉద్యానవనాన్ని చూడవచ్చిన వారికి అన్ని సదుపాయములు చేయించాడు ఆ రాజు. ఆ పూలతోటను చూచి మురిసిపోయేవాడు. ఆనందంతో పరవళ్లు త్రొక్కేవాడు.

దేశం నలుమూలలనుండి ఎందరెందరో రాజులు అందమైన పూలతోటను చూడవచ్చారు. ఆ నాడు తెలుగుదేశానికి రాజు రాజ్యశ్రీ. ఆయన బింబిసారుని పూలతోట గొప్పదనం విని చూడవలయునని ఉబలాటపడ్డాడు.

మద్దులూరి రామకృష్ణ

ఆ బింబిసారుని పూలతోట ఎట్లాగైనా చూచి తీరాలనుకొన్నాడు రాజ్యశ్రీ. మంచిరోజు తిథి, వార నక్షత్రాలు చూచి ప్రయాణమయ్యాడు. బింబిసారుడు రాజ్యశ్రీ పూలతోట చూడవస్తున్న వార్త విని గర్వంతో చాల సంతోషించాడు. రాజమర్యాదలు చేసి రాజ్యశ్రీని గౌరవించాడు. కళకళలాడే పచ్చపచ్చని అందమైన పూలతోటల సొంపుచూచి ఎంతో సంబరపడ్డాడు. రాజ్యశ్రీ అజంతా చూస్తే అంత అందమైన పూలతోట నేలపైన ఎక్కడైనా ఉందా! ఇది నిజమా - కలా అనిపించింది అతనికి.

"నా దేశాన్ని ఇంకా అందంగా చేయాలని ఉంది. కాని ఇందువలన చాలమంది మనసులు బాధ పడవచ్చు. ఇతరులు ఎంతో కష్టపడి ప్రేమతో కట్టుకొన్న ఇళ్లు నేల మట్టం చేయవలసివస్తుంది. ఏమయినా సరే కాని జనం నన్ను ప్రేమిస్తే అదే పదివేలు" అన్నాడు బింబిసారుడు.

"నా తెలుగుదేశాన్ని కూడ మీ రాజ్యమంత అందంగా చేయ ప్రయత్నిస్తా. మీ రాజ్యాన్ని చూడటం నాకెంతో ఆనందంగా ఉంది. రేపు సెలవు తీసికొంటా" అన్నాడు రాజ్యశ్రీ. ఆ సాయంత్రం బింబిసారుడు రాజ్యశ్రీ, ఉద్యానవనంలో పొదరిండ్లదాపున మెత్తని రత్నకంబళివలెనున్న పచ్చిగడ్డి పరుపుపై కూర్చొని వికసించిన గులాబీలు, మందారాలు, సంపెంగలు ఇంక రకరకాలయిన రంగురంగు పూలు తనివితీర చూస్తూ ఆనందాన్ని జుర్రుతున్నారు.

ఇంతలో ఎందుచేతనో ఏమో వికసించిన బింబిసారుని ముఖం క్షణంలో చిన్నబుచ్చుకుంది. "ఏమి అలా ఉన్నారు" అన్నాడు రాజ్యశ్రీ. "అసలు మునుపు ఇచ్చట పూలతోట లేనే లేదు. ఈ తోట వేసిన చోటు నాది కాదు."

"మరి ఎవరిది?"

"ఇదొక ముసలమ్మది."

"నిజంగానా? ఆమె మీకు అమ్మిందా?"

"నే పుట్టినగడ్డ ఎవరికీ అమ్మను అని అతి జాలిగా ప్రతిఘటించింది. అదవాయించి, గదమాయించి ఆమెను అక్కడనుండి బలవంతంగా వెళ్లగొట్టించా."

"ఆమెకు నచ్చచెప్పి తేరుగా తోటు చూపి తీసికొన్నా ఎంతో బాగుండేది కదూ?"

"ఔను నిజమే" అన్నాడు ఎంతో చిన్నబుచ్చుకున్న ముఖంతో బింబిసారుడు. అతనికి తెలియకనే కన్నుల అల అయినవి.

"అందమైన తోట వెయ్యాలనే ఆత్రంతో, పాపం! ఆ ముసలి దాని నోట దుమ్ముకొట్టా - ఆ ముసలి దాని పూరిగుడిసె పీకివేయించా. ఆయ్యో, మొర్రో అని ఏడుస్తూ వుంటె అవతలకు నెట్టివేయించా" అన్నాడు బింబిసారుడు.

చాలసేపు బింబిసారుడు, రాజ్యశ్రీ మాటాడక ఒకరినొకరు చూస్తూ తాతిజాపున్న అలాగా కూర్చున్నారు. రాజ్యశ్రీ బింబిసారుని చూచి చిరునవ్వు నవ్వాడు. బింబిసారుని కన్నులవెంట కన్నీరు ప్రవహించింది.

"నేను మూర్ఖుడను" అని విచారంతో ఒక్కమాటకన్న ఎక్కువ అనలేకపోయాడు బింబిసారుడు.

"ఇంత అందమైన పూదోటను నీరాజ్యంలో మరెచ్చటా చూడలేదు. దీనిని చూచి లోకం ఏమనుకుంటుంది. ఆ సంగతి వింటే నీ మనస్సు ఏలాగుంటుంది" అన్నాడు రాజ్యశ్రీ.

బింబిసారుడు మారు మాటాడలేకపోయాడు. ధర్మంగా పాలించే మగధరాజువు నీవేగా అని బింబిసారుని భుజాల తట్టి నిదానంగా ఆయన కన్నులులోనికి చూచాడు రాజ్యశ్రీ.

"నా సుఖం-ఆనందంకోసం-ఎవరికీ అపకారం తలపెట్టను. ఒట్టు-నీరాకవలన నాకెంతో మేలు కలిగింది" అని మెల్లగా అన్నాడు బింబిసారుడు.

"నిజంగా ధర్మరాజు అంటె మీరే. న్యాయానికి ఎంతో విలువయిస్తారు", అని దీర్ఘఆలోచనలోనున్న బింబిసారునివైపు రాజశ్రీ చూచాడు.

"మా రాజ్యానికి ఎంతో దయగల రాజుగా తిరిగి వెళ్లుచున్నా. మీ మేలు ఎల్లకాలం మరువలేను" అన్నాడు రాజ్యశ్రీ.

"రాజ్యశ్రీ! నీవు మంచిరాజువు" అన్నాడు బింబిసారుడు నిదానంగా.

"లేదు-లేదు-ఇక ముందు నేను మంచి రాజుగా ఉండ ప్రయత్నిస్తాను"-అన్నాడు రాజ్యశ్రీ. ★

